
# నా మూడో మరణం

— ఆసం శ్రీనివాస్



అమ్మ ఒక అక్షయపాత్ర!
తరగని ప్రేమైక సుధారస పాత్ర!
అమ్మ ఎప్పటికీ సజీవపాత్ర!

★ ★ ★

''మానవ సంబంధాలన్నీ మానవత్వం కోల్పోయి చాలా కాలమయింది. అవసరం చుట్టూరా తిరుగుతూ, అవకాశాన్నిబట్టి రూపు మార్చుకుంటూనే వున్నాయి. పరిస్థితి బట్టి ప్రవర్తన. స్థితిని బట్టి పరివర్తన.

ఇంతే! ఇంకేమీ లేదు. ఈ ఏమీ లేకపోవటం వల్లే మనిషి ఏకాకిగా మారుతున్నాడు. జనారణ్యంలో మృగతృష్ణకై వెదుకులాడే వేటగాడవుతున్నాడు''

హోరున చప్పట్లు.

నేను సంతృప్తిగా ఉపన్యాసాన్ని ముగించాను. చప్పట్లు ఇంకా కొనసాగుతూనే వున్నాయి. కార్యవర్గ సభ్యుల దగ్గర శలవు తీసుకుని, మిత్రుడు ధర్మమిత్రతో కలిసి కారులో ఇంటికి బయలుదేరాను.

''చాలా చక్కటి ఉపన్యాసం'' అభినందించాడు ధర్మమిత్ర.

నేను గర్వంగా నవ్వి, వూరుకున్నాను. ఈ చప్పట్లూ, అభినందనలూ నాకు పాతబడి చాలా కాలమయింది. అయినా, అప్పుడప్పుడూ ధర్మమిత్ర లాంటి మేధావి వర్గం మెచ్చుకున్నప్పుడు నాకు తెలీకుండానే గర్వంగా ఫీలవుతుంటాను.

ఉన్నట్టుండి, ''కారాపు'' అన్నాడు ధర్మమిత్ర.

అతనెందుకలా అన్నాడో అర్థంకాక స్లో చేసి, ఓ పక్కన ఆపాను.

ధర్మమిత్ర దృష్టి ఇక్కడ లేదు. చెట్టుకింద కూర్చుని అడుక్కుంటున్న ఓ బిచ్చగత్తె వేపు జాలిగా చూస్తున్నాడతను.

ఆమె మీంచి బలవంతంగా దృష్టి మరల్చి, ''ఏమయింది?'' అడిగాను ధర్మమిత్రను.

''ఒక్క నిమిషం ఇక్కడే వుండు'' అనేసి, కారు దిగి వెళ్లి ఆ బిచ్చగత్తె చేతిలో వందనోటు పెట్టివచ్చాడు. ఇతను ఇంతకు ముందోసారి కూడా ఇలాగే చేశాడు.

తిరిగి బయలుదేరాక నేను విస్మయంగా అడిగాను.

''ఎందుకా బిచ్చగత్తంటే నీకు ప్రత్యేకమైన అభిమానం?''

''ఆవిడ బిచ్చగత్తె కాదు శశాంకా. బ్రతికి చెడిన ఓ మధ్య తరగతి స్త్రీ. కొడుకు దగాచేసి, బయటికి గెంటితే ఏదారీ లేక చివరికీ స్థితికొచ్చింది'' గంభీరంగా అన్నాడు ధర్మమిత్ర.

''నీకెలా తెలుసు?'' ఆశ్చర్యంగా అడిగాను.

''ఎవరో చెప్పారు. ఇంతకుమించి నాకే వివరాలూ తెలీవు. అప్పట్నించీ నాకావిడంటే జాలి. ఎక్కడ కనిపించినా నాకు చేతనైనన్ని డబ్బులు వేస్తూనే వస్తున్నాను.''

నేనింకేమీ తర్కించలేదు. కొంతమంది తమకి తెలీకుండానే మనమీద ప్రభావాన్ని చూపిస్తారు. ధర్మమిత్ర కూడా అంతే. తన సాధు స్వభావంతో నాలోని మలినాన్ని కడిగేస్తూంటాడు.

''ఇలాంటి సహజమైన క్యారెక్టర్స్‌ని పెట్టి నువ్వో నవలెందుకు రాయకూడదు? ఎప్పుడూ ప్రేమలూ, విరహాలూ అంటూ ఊహాలోకంలోకి తీసికెళ్లే కథలే ఎందుకు రాస్తుంటావ్?'' అన్నాడు ధర్మమిత్ర.

''కథలేం ఖర్మ నవలే రాయొచ్చు. కానీ ఒక్కటి. ఇలాంటి కథలు సాహితీ వేదికల్లో సగర్వంగా

## వెధవ

ఏడుస్తూ వస్తున్న కొడుకును కేకలేస్తూ అంది తల్లి. ''మళ్లీ ఏ వెధవన్నర వెధవతో తన్నులు తిని వస్తున్నావురా!''

''నాన్న కొట్టారు మమ్మీ!'' చెప్పాడు బుజ్జి చల్లగా.

- దూదూరు నాగభూషణం
(ఎర్రగుడి)

చెప్పుకోడానికీ, మేధావుల్లో చర్చగా మారటానికీ తప్ప కమర్షియల్‌గా ఉపయోగపడవు'' అన్నాను.

''కథలన్నీ డబ్బుకోసమే రాస్తే రచయిత తనకోసం ఏమీ వ్రాసుకోలేడు. నీకోసం, కొంతకాలమైనా పాఠకులు నీపేరు చెప్పుకోవడం కోసం ఏదైనా వ్రాసుకోవాలి శశాంకా.''

''ఇప్పుడు నా పేరుకొచ్చిన భంగమేమిటి?''

''నలుగురు అమ్మాయిలు గుర్తుపట్టి ఆటోగ్రాఫ్‌లడగటమో, నాలుగు పత్రికల్లో ఫోటోలు పడటమో, పేరు అనుకుంటే పొరపాటే. సాహిత్యం కోవలోకి వచ్చే రచనలు చేయి. అప్పుడే తరవాతి తరానికి ఆదర్శంగా నిలబడగలుగుతావు.''

నేను చిన్నగా నవ్వాను. ''నువ్వు చాలా అందంగా తర్కించగలవు ధర్మమిత్రా. కానీ తర్కంతో పరిస్థితులు మారవు'' అన్నాను.

''అలా నువ్వనుకుంటే నేనింకేమీ చెప్పలేను. కానీ ఒకటిమాత్రం నిజం. ఒక రచయిత కొన్ని రసాలు వ్రాస్తే చాలదు. అన్నిరసాలూ అద్భుతంగా వ్రాయగలగాలి. అప్పుడే అన్నివర్గాల పాఠకులను ఆకట్టుకోగలడు.''

నేను సమాధానం చెప్పలేదు.

నాకు చాలా అసహనంగా వుంది. ప్రపంచంలోని ఏ వస్తువుని తీసుకునైనా కథ వ్రాయగలనేమో కానీ, ఆ బిచ్చగత్తె కథ మాత్రం వ్రాయలేను.

ఈ విషయం ధర్మమిత్రకు తెలీదు.

అతనికి ఇంకో విషయం కూడా తెలీదు.

'ఆ బిచ్చగత్తె మా అమ్మని!'

★ ★ ★

''మా అమ్మ కనిపించింది'' చెప్పాను నా భార్యతో భోం చేస్తూన్నప్పుడు.

ఆమె ముఖం చిట్లించింది. ''వెళ్లి మాట్లాడారా?'' ఆరాగా అడిగింది.

''లేదు. పక్కన ధర్మమిత్ర వున్నాడు. అందుకే...'' గుండె గొంతుకలో కొచ్చినట్టు మాట బయటికి రాలేదు. మంచినీళ్లు తాగాను.

''కొంపదీసి ఆవిడ మీ అమ్మని, ధర్మమిత్ర గారికి చెప్పారా ఏమిటి?''

''లేదు. చెప్పలేదు. చెప్పలేను కూడా!'' గద్గదంగా అన్నాను.

ఆవిడ తాపీగా పోనీటెయిల్ విప్పుకుని, తీరిగ్గా దువ్వుకుంటూ, ''పెరుగు వేసుకోండి'' చెప్పి వెళ్లిపోయింది.

నాకు భోజనం మింగుడు పడలేదు. జీర్ణంకాని జీవిత సత్యంలా ముద్ద గొంతు దిగటంలేదు. లేచి చేయి కడిగేసుకున్నాను.


ఆరాత్రి నాకు నిద్రలేదు. పక్కన నా భార్య చాలా హాయిగా నిద్రపోతోంది. ఒక్క క్షణం ఆమె పీక పిసికి చంపేయాలన్నంత ఆవేశం నాలో కలిగింది.

అసహనంగా అటూ ఇటూ పొర్లాను. ఏదో అశాంతి. మాటిమాటికీ కళ్లముందు అమ్మ దీనంగా అడుక్కునే దృశ్యమే గుర్తొస్తోంది.

నాకోసం రక్తమాంసాల్ని తృణప్రాయంగా ఎంచి- నాకోసం శుష్కించిపోయి జీవచ్ఛవంలా మారిన అమ్మ. పనిమనిషి అంటూ నాభార్య తన స్నేహితులకు పరిచయం చేసిందని అహం దెబ్బతిని వెళ్లిపోయిన అమ్మ. ఎంత బ్రతిమాలినా తిరిగిరాని అమ్మ.

'అమ్మా' మనసు ఆక్రోశించింది. 'రామ్మా' గుండె బలహీనంగా పిలిచింది.

నా గుండెని అటొకరూ ఇటొకరూ రంపం పట్టుకుని కోస్తున్న భావన.




భార్య నా బలహీనత.

అస్థిమితంగా లేచి కూర్చున్నాను. ఎదురుగా టేబుల్ పైనున్న రైటింగ్ ప్యాడ్ మీది కాగితాలు జ్ఞాపకాల్లా రెపరెపలాడుతున్నాయి.

నాకు వెంటనే ధర్మమిత్ర అన్న మాటలు గుర్తొచ్చాయి. అవును- అమ్మ కథ వ్రాస్తే తప్ప ఈ బాధ కాస్తయినా ఉపశమించదు. బిచ్చగత్తె కథ కాదు- అమ్మ కథ. నా ఆత్మకథ.

లేచి వెళ్లి కలం అందుకున్నాను.

జడివానకు జడిసి జడిసీ, కుంభవృష్టిలో తడిసి తడిసీ, హోరుగాలిలో విసరి విసరీ, ఉప్పెనలో మునిగి మునిగీ, జనన మరణాల మధ్య బ్రతికి చచ్చీ, విధి చేతిలో విసిగి విసిగీ, వేసారి, కడసారి కన్నీరు కార్చిన గుండె, నా కలం కడుపున గర్భం దాల్చినప్పుడు, ఆ ప్రసవ వేదనలో, ఆ మరణ యాతనలో, కాగితాలపై సిరాస్రావం, పుడుతూ పోసుకుంటున్న అక్షరాల సుఖదుఃఖ ప్రసవం- వెరసి అమ్మ కథ.

ఆరునెలల తరవాత-

ఆ కథకే కేంద్ర ప్రభుత్వం అవార్డు ప్రకటించింది.

★ ★ ★

విపరీతమైన ఫోన్‌కాల్సూ, గ్రీటింగులూ, టెలిగ్రాములూ, ఉత్తరాలూ, పత్రికల్లో నా ఇంటర్వ్యూలూ, టీవీ వార్తల్లో నా పేరూ.

నేను ఓడి గెలిచానో- గెలిచి ఓడానో నాకర్థంకాలేదు.

నిశ్చయంగా చెప్పగలను. గెలుపును ఆస్వాదించ లేకపోవటం కూడా ఓటమే. నేను ఓటమిని కృషిచేసి సాధించుకున్నానో, కష్టపడకుండానే విజయం నన్ను వరించిందో నాకు తెలీదు.

తెలిసిందల్లా నేనాశించిన విజయం ఇదికాదు.

నీ విజయం- ఆత్మ సంతృప్తి. అది లేనప్పుడు మిగిలేది అసంతృప్తి.

బ్రహ్మజ్ఞానం పొంది మోక్షం సాధించినా, వైరాగ్యం పొంది బ్రహ్మజ్ఞానానికై తపించినా, ఆ తపనలో కనిపించేదే తృప్తిలో పరాకాష్ట. ముముక్షువులకే అది సాధ్యం.

నా పరిస్థితి అలాకాదు. నేను రుషిని కాదు.

మామూలు మనిషిని. ఇప్పుడీ పరిస్థితిలో అన్నీ వొదులుకుని సన్యసించాలని వుంది. కానీ అన్నీ వొదులుకోవటం కూడా సన్యాసం కాదని అర్థమైంది. మనసునంటుకున్న జ్ఞాపకాలని నేను సన్యసించలేనని అవగతమైంది. నిజమే. నేనూ మానసికంగా వ్యభిచరించలేను.

ఇది ఆత్మలోని అంతరాత్మ వంచన.

ఈ వంచనపైనే నేను పునాది లేపుకుని భవంతి నిర్మించుకున్నాను. ఈ వంచనపైనే అందమైన ముసుగు వేసుకుని సామాజిక హోదా పెంచు కున్నాను. ఈ వంచనపైనే నన్ను నేను పోగొట్టు కున్నాను.

ఆత్మవంచన వేరు- ఆత్మహత్య వేరు అనుకుంటారంతా. కానీ రెంటికీ తేడా లేదు. ఆత్మని చంపుకున్నప్పుడే మొదటి మరణం!

నా మరణంతో ప్రమేయం లేకుండా-

ప్రభుత్వం నాకు అవార్డు ప్రదానం చేసింది. అది అందుకోవటానికి నేను వేదికనెక్కాను. మనిషిగా మరణించాను అని తెలీని పిచ్చి ప్రభుత్వం రచయితగా నన్ను బ్రతికించింది.

బ్రతికి చచ్చిన జీవచ్ఛవానికి మరింత హోదా పెంచింది.

★ ★ ★

ఆ తరువాత- ఓ సాంస్కృతిక సంస్థ నాకు సన్మానం చేయడానికి ముందుకొచ్చింది.

నా ప్రమేయం ఏమీలేదు. అంతా నా భార్య, ధర్మమిత్ర కలిసి ఏర్పాట్లు చూసుకున్నారు. నేను గొర్రెలా తల వొగ్గాను. కారులో ఆడిటోరియంకు బయలుదేరాను.

గేటు దగ్గరే ఈ గొర్రె మెడమీద వేటు పడింది- అమ్మ ఆడిటోరియం బయట అడుక్కుం టోంది.

మా ఆవిడ- మా అమ్మని చూసినా చూడనట్టు తల తిప్పుకుంది. నేను చూసినా- చచ్చినవాడికిమల్లే తల దించుకున్నాను. ఇవేమీ తెలీని ధర్మమిత్ర కారు దిగి వెళ్లి అమ్మకు భిక్షమేసి వచ్చాడు.

స్తబ్దమైన మనసుతో- నిశ్శబ్దమైన ఆలోచనల్తో నిర్వీర్యంగా వేదికనెక్కాను.

ఎవరో నా మెడలో పూలదండ వేస్తున్నారు. అతిథిగా వచ్చిన ఎవరో శాలువా కప్పుతున్నారు. మైకు ముందు నిలబడ్డ సాంస్కృతిక శాఖా మాత్యుడు నా గురించి అంతా తెలిసినట్టే ఉపన్యాసం దంచుతున్నాడు.


సభలో నేను జడపదార్థంలా కూర్చున్నాను. ప్రేక్షకుల మధ్య మా ఆవిడ జీవపదార్థంలా కూచుంది. మొదటి వరసలో ధర్మమిత్ర చైతన్య పదార్థంలా కూర్చున్నాడు. బయట అమ్మ బిచ్చగత్తెలా అడుక్కుంటోంది.

చాలా చిత్రమైన స్థితి ఇది. బయట అడుక్కునే అమ్మ కథ వ్రాసి లోపల కొడుకు సన్మానింపబడే వ్యథ. మెలోడ్రామా సొద.

అందరికళ్లల్లో నాపట్ల ప్రశంస మెదులు తోంటే- నా కళ్లల్లో నాపట్ల అసహ్యం పెరుగుతోంది. మైకు ముందు ఎవరు పొగుడు తున్నా తిడుతున్నట్టుగానే అనిపిస్తోంది. తిట్టే వాళ్లంటే, విమర్శించి కత్తులతో కోసేవాళ్లంటే బాపుండుననిపిస్తోంది.

చచ్చిపోయిన అంతరాత్మ దెయ్యమై తిరిగివచ్చి నన్ను పీడిస్తోంది. నిజం- ఈ దెయ్యం వదలదు నేను కూడా దెయ్యమయ్యేదాకా!

సరిగ్గా ఆ సంఘటనే నన్ను బర్స్ట్ అయ్యేలా చేసింది.




ఈ విషయాన్ని ధర్మమిత్రకు చెప్పకుండా వుండలేని స్థితికి తెచ్చింది.

★ ★ ★

కన్నీళ్లు (నిజమైనవే. గ్లిసరిన్ లేదు) పెట్టుకుంటూ నేను చెప్పిన విషయం విని ధర్మమిత్ర చాలాసేపు మాట్లాడలేదు. నాకు తెలుసు- అతను దిగ్భ్రాంతికి లోనవుతాడని.

నిజమే! కుళ్లిపోయిన గుండె చుట్టూ జాస్మిన్ స్ప్రే కొట్టి మల్లెపూల పరిమళం అంటూ మభ్యపెట్టిన నేను- నాలోని నేనేమిటో చెప్పినప్పుడు, ఎవ్వరైనా అదే స్థితికి వెళ్లిపోతారు.

చాలాసేపటికిగానీ ధర్మమిత్ర తేరుకోలేదు. తేరుకున్నాక నాలుగే నాలుగు మాటలు క్లుప్తంగా మాట్లాడి శలవు తీసుకున్నాడు.

''చూడూ, ఇప్పుడు నీకు మిగిలినవి రెండే రెండు మార్గాలు. ఒకటి- తక్షణమే వెళ్లి మీ అమ్మను తీసుకురావటం! రెండోది- అలా వీలుకాని పక్షంలో నువ్వు ఉరేసుకుని చావటం!''

★ ★ ★

నేను రెండోదే చేశాను!

ఎందుకంటే తిరిగి రమ్మన్న నా అభ్యర్థనని మా అమ్మ సున్నితంగా తిరస్కరించింది కాబట్టి.

ధర్మమిత్ర ఏదో అంటాడని కూడా కాదు. ''ఎక్కడున్నా నువ్వు చల్లగా వుంటే చాలు నాయనా!'' అని ఆర్ద్రంగా అమ్మ అన్నందుకు.

అందుకే నేను ఉరేసుకున్నాను. రెండోసారి భౌతికంగా మరణించాను.

★ ★ ★

నా శవాన్ని హాల్లో ఐసుమీద వుంచారు.

నా తల పక్కన అగరొత్తుల పరిమళాన్ని ఆస్వాదిస్తూ మా ఆవిడ నిర్వికారంగా కూర్చుంది. ధర్మమిత్ర గోడకు తల బాదు కుంటూ ఏడుస్తున్నాడు. బంధువులు, మిత్రులు, సాహితీ సహచరులు, అభిమానులు అంతా నన్ను (నా శవాన్ని) చూసి దూరంగా వెళ్లిపోతున్నారు.

నిర్జీవమైన శరీరం మీద నేను అప్రమితంగా అటూ ఇటూ కదులుతున్నాను. చిత్రంగా

నాకేవో మాటలు అంతర్వాణిలా వినిపిస్తున్నాయి. అవేమిటో, ఎటువేపునించి వస్తున్నాయో నాకర్థంకాలేదు.

మా ఆవిడ వేపు చూశాను. ఆశ్చర్యం! ఆ మాటలు ఆమె మనసులోంచి వస్తున్నాయి. స్పష్టంగా వినటం కోసం పొగలా వెళ్లి ఆమెని చుట్టుముట్టాను. క్రమక్రమంగా నా భార్య మనసులోని ఆలోచనలు నాకు మాటల రూపంలో వినిపిస్తున్నాయి.

''దరిద్రుడు! పోతే పోయాడు! ఎప్పుడూ ఆ పనిమనిషిలాంటి ముసిల్దాన్ని పట్టుకుని అమ్మా అమ్మా అంటూ కలవరించి చస్తాడు. పీడా వదిలింది. ఇంతకీ బ్యాంకు బ్యాలెన్స్, ఇన్స్యూరెన్సు అన్నీ కలిపితే యాభై లక్షలుంటుందో లేదో? ఉంటుందిలే! బాగానే సంపాదించి చచ్చాడుగా? అన్నీ బాగానే వున్నాయి గానీ, నా వయసంతా వృధా అయిపోతుంది- అదే బాధ! అన్నట్టు, ధర్మమిత్ర బాగానే వుంటాడు. పెళ్లాన్ని పోగొట్టుకుని వొంటరిగా వున్నాడు. మెల్లగా రంగంలోకి దింపి, పెళ్లి ప్రసక్తి తెస్తే ఎలా వుంటుంది? నిజమే! ఇద్దరం సెకండ్‌హాండ్ గాళ్లమే కాబట్టి వొప్పుకుంటాడు. కానీ దానికోసం 'వీడి' దినవారాలు అయ్యేదాకా ఆగాలి. సరే, ఏం చేస్తాం? లోకం కోసమైనా ఏడవాలి కదా?'' ఆమె మనసులో మాటలు ఆగిపోయాయి. నోట్లోంచి మాటలు వెలువడ్డాయి.

''ఏవండీ!'' మా ఆవిడ భోరున ఏడవటం మొదలుపెట్టింది.

ఆడవాళ్లంతా వోదార్చటం మొదలుపెట్టారు. మా ఆవిడ తల బాదుకుంటోంది. బంధువులు ఆవిడకి వచ్చిన కష్టాన్ని గురించి బాధగా చర్చించుకుంటున్నారు.

నేను వేదాంతిలా నవ్వుకున్నాను. నాకోసం మా అమ్మ సుఖాల్ని వొదులుకుంటే- నేను ఈ భార్య కోసం అమ్మను వదులుకున్నాను. ఇప్పుడు అమ్మకోసం నా ప్రాణాలు వొదులుకున్నా- అమ్మ రాలేదు. నా భార్య మారలేదు.

ఇంతలో ధర్మమిత్ర తేరుకుని ఎవరితోనో అంటున్నాడు.

''నేనెళ్లి శశాంక తల్లిని తీసుకొస్తాను.''

నా గుండె లయ తప్పింది. కనీసం ఇప్పుడయినా అమ్మ తిరిగొస్తుందేమో!?

అమ్మ తిరిగొచ్చిందో లేదో నాకు తెలిసేలోపే యమభటులు వచ్చారు. నన్ను చెరో ప్రక్కనా పట్టుకుని పైకి తీసికెళ్లసాగారు. నాకింకా అక్కడినించి కదలాలని లేదు. కానీ వీళ్లు నామాట వినటం లేదు.

కనీసం చివరిసారి అమ్మను చూసొస్తానన్నా వినలేదు. చేసేదేమీలేక ప్రతిఘటించటం మానుకున్నాను. అశాంతిగా వాళ్లని అనుసరిస్తున్నాను.

శూన్యంలో, మేఘాల్లో వాళ్లెంతదూరం తీసుకువెళ్లారో నాకు తెలీదు. ఏదో లోకం కనిపించింది. దూరంగా నది. వైతరణి కాబోలు.

ఆ ఒడ్డును చేరుతూండగా జరిగిందది.

ఓ బ్రహ్మాండమైన తేజస్సు ప్రజ్వలిస్తూ కనిపించింది. క్రమక్రమంగా ఆ తేజస్సు సన్నగిల్లి ఓ పుష్పక విమానం దర్శనమిచ్చింది.

అప్రయత్నంగా చేతులు జోడించారు యమదూతలు.

ఆ విమానం నెమ్మది నెమ్మదిగా మా ముందుకు వచ్చి ఆగింది.

ఆశ్చర్యం! అమ్మ అందులోంచి దిగింది! వెంట

ఇద్దరు దేవదూతలు.

ఇదేమిటి- అమ్మ... అమ్మెలా మరణించింది?

''అమ్మా?!'' అన్నాను ఆర్తిగా.

అమ్మ నా దగ్గరికి పరుగున రాబోయింది. చప్పున దేవదూతలు అమ్మని ఆపి- ''భవబంధాలన్నీ వొదులుకోకపోతే స్వర్గలోక ప్రవేశం సాధ్యం కాదమ్మా!'' అన్నారు.

''కాకపోనీ! నా బిడ్డని యమభటులు లాక్కుపోతోంటే తల్లిగా నేనెలా చూస్తూ వుండగలను?'' కోపంగా అంది అమ్మ.

నాకిదంతా ఆశ్చర్యంగా, నమ్మశక్యం కాకుండా వుంది. ఇంటికి తిరిగి వస్తుందనుకున్న అమ్మ పుష్పక విమానంలోంచి దిగిందేమిటి?

నేనింకా ఆ దిగ్భ్రాంతినుంచి తేరుకోకముందే దేవదూతలు అమ్మతో అంటున్నారు. ''ఇతను పాపి. నరకానికి చేరుతున్నాడు. మీకు ఆ జన్మలో ఇతను కొడుకయి వుండవచ్చుగాక- ఇప్పుడతన్ని తాకితే మీరూ నరకానికే పోతారు.''

నేను తేరుకున్నాను. నిజమే! నాలాంటి వాడిని క్షమించిన ఏ తల్లయినా నరకానికే పోతుంది. ఇప్పుడయినా, ఇక్కడయినా నేను అమ్మని సుఖంగా వుండనివ్వకపోతే నా జన్మకి అర్థమే వుండదు.

అందుకే అమ్మకు అందకుండా దూరం జరిగి, ''వొద్దమ్మా! రావద్దు! నన్ను తాకి నువ్వు పాపాత్మురాలిగా మారటం నాకిష్టంలేదు. నాకిప్పుడు చాలా సంతృప్తిగా వుందమ్మా! ఆ జన్మలో నిన్నెలాగూ సుఖంగా వుండనివ్వలేకపోయాను. ఇక్కడైనా నువ్వు సర్వసౌఖ్యాలతో వుంటే నాకంతే చాలు. నాకు మాత్రం- నేను కోరుకున్న శిక్షే పడింది. బ్రతికున్నప్పుడెలాగూ ఎవరూ నన్ను శిక్షించలేకపోయారు. ఇప్పుడు నరకంలో నేను స్వర్గాన్ని అనుభవించడానికే వెళుతున్నాను. నాకోసం బాధపడకమ్మా!'' అన్నాను ఆర్ద్రంగా.

''అయ్యో నాయనా! నేను ఇంటికి తిరిగొస్తే కోడలు నిన్ను సుఖంగా వుండనివ్వదేమో అని భయపడి, నీ మనశ్శాంతి కోసమే రాలేదురా! కానీ నేను రాకపోతే నువ్వు చావడానికైనా వెనుకాడవని తెలిస్తే తప్పకుండా తిరిగొచ్చేదాన్ని! ఇదంతా నావల్లే జరిగింది- పాపిష్టిదాన్ని'' విలవిల్లాడుతూ అంది అమ్మ.

''నా శవాన్నయినా చూడటానికి నువ్వొస్తావేమో అనుకున్నానమ్మా! కానీ ఇక్కడ ఇలా నిన్ను కలుసుకోవాల్సి వస్తుందని ఊహించలేదు!''

''అయ్యో! ఎంత పొరబడ్డావు నాయనా! చెట్టంత కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడని తెలిస్తే ఏతల్లి భరించగలదురా? నీ చావు వార్త విన్న వెంటనే నేను గుండె ఆగి మరణించాను.''

ఉలిక్కిపడి తలెత్తాను.

శత శతఘ్నులు పేల్చినట్టు

శత సహస్ర ఖండ ఖండాలుగా చీల్చినట్టు

శరాఘాతం తాకినట్టు- శరణాగతి లేనట్టు

మిన్ను విరిగి మీద పడినట్టు- మన్ను విరిగి కూరుకుపోయినట్టూ

నేను లేనే లేనట్టు- విశ్వమంతా అమ్మే అయి నిండి వున్నట్టూ

రెండుసార్లు చంపిన అమ్మ- మూడోసారి నన్ను చంపినట్టు

అప్పుడే, అక్కడే, ఆ క్షణమే

నేను అన్నివిధాలుగా మరణించాను!

★